JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 01-11-2025
Medchal - Malkajgiri । Saturday 01-11-2025
jayabherinews
సంపుటి : 02 । సంచిక : 155 । పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 155 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com


## అజారుద్దీన్ అనే నేను




మాజీ క్రికెటర్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ, మహ్మద్ అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణం స్వీకారం చేశారు. ఆయనతో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పదవీ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి తోపాటు పలువురు మంత్రులు, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఇతర కాంగ్రెస్ సీనియర్ నేతలు హాజరయ్యారు.

- మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం

**హైదరాబాద్, అక్టోబరు 31:**

మాజీ క్రికెటర్, కాంగ్రెస్ ఎమ్మెల్సీ, మహ్మద్ అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణం స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అజారుద్దీన్ కృతజ్ఞత తెలియజేశారు. సహచర మంత్రులు, నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. అజారుద్దీన్ రాకతో తెలంగాణ కేబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరింది. ఆయనకు ఏ శాఖలు కేటాయిస్తారనే చర్చ నడుస్తోంది. ప్రస్తుతానికి చాలా శాఖలు ముఖ్యమంత్రి వద్దే ఉన్నాయి. మైనార్టీ సంక్షేమం, విద్యా, హోంశాఖ అన్నీ కూడా రేవంత్ తన వద్దే ఉంచుకున్నారు. ఇందులో ఏ శాఖను ఆయనకు ఇస్తారనే ఆసక్తి నెలకొంది. అయితే మైనార్టీ సంక్షేమ శాఖ లేదా క్రీడా శాఖ ఇస్తారని ప్రచారం నడుస్తోంది. 1963 ఫిబ్రవరి 8న అజారుద్దీన్ హైదరాబాద్‌లో జన్మించారు. అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్య, నిజాం కాలేజీలో ...మిగతాది 2 లో

## పంటపొలాల్లో యుద్ధప్రాతిపదికన నీటి నిల్వలు మళ్లింపు



- శాటిలైట్ చిత్రాలతో గుర్తించి 24 గంటల్లో పూర్తి కార్యాచరణ
- ఆస్తి నష్టంపై కేంద్రానికి ప్రాథమిక నివేదిక సమర్పించండి
- తుఫాన్ విధుల్లో ప్రతిభ చూపిన 100 మందికి సన్మానం
- టెలి కాన్ఫరెన్స్‌లో అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

**అమరావతి, అక్టోబర్ 31 :**


మొంథా తుఫాన్‌తో రైతులు నష్టపోకుండా రాష్ట్రంలో నీట మునిగిన పంట పొలాలను యుద్ధప్రాతిపదికన కాపాడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తుఫాన్ తదనంతర చర్యలపై శుక్రవారం ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాటిలైట్ చిత్రాల ఆధారంగా ఎక్కడెక్కడ పొలాలు నీట మునిగాయో గుర్తించి శనివారం కల్లా మొత్తం నీటిని మళ్లించాలని సీఎం ...మిగతాది 2 లో

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంను మరింత గడువు కోరిన స్పీకర్

- ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయానికి మరో రెండు నెలల గడువు
- సుప్రీంను కోరిన తెలంగాణ స్పీకర్

**హైదరాబాద్ అక్టోబర్ 31**

ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు తెలంగాణ స్పీకర్ మరింత గడువు కోరారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై విచారణకు సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు శుక్రవారంతో ముగిసింది. ఈ క్రమంలో స్పీకర్ కార్యాలయం.. ఎమ్మెల్యేల విచారణకు న్యాయస్థానాన్ని మరో రెండు నెలల గడువు కోరింది. పార్టీ ఫిరాయించిన10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులివ్వగా.. వారిలో 8 మంది మాత్రమే స్పందించారని, నలుగురి విచారణ మాత్రమే ముగిసిందని, మిగతా వారిని విచారించాల్సి ఉందని స్పీకర్ తరపు లాయర్లు సుప్రీంకోర్టుకు తెలిపారు. కాగా, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 10



మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీంతో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ స్పీకర్ కు సుప్రీం మూడు నెలల గడువు విధించింది.




# ఎవ్వరూ అధైర్య పడవద్దు

- రైతులను నట్టేట ముంచిన తుఫాను
- ఏరియల్ సర్వే చేసిన రేవంత్
- వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంది
- వరదల వల్ల 12 జిల్లాల్లో తీవ్రంగా నష్టం
- నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు 10 వేల రూపాయల చొప్పున పరిహారం
- క్షేత్రస్థాయిల్లో పంట నష్టం వివరాలను నమోదు చేస్తూ నివేదికలివ్వాలి
- వరదల వల్ల ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 లక్షల చొప్పున నష్టపరిహారం

**హైదరాబాద్, అక్టోబరు 31**

తెలంగాణ రాష్ట్రాన్ని అతలాకుతలం చేసింది. ఆరుగాలం శ్రమించి, పంట ఇంటికి వస్తున్న టైంలో ఈ తుపాను రైతన్నలకు అపార నష్టాన్ని మిగిల్చింది. కోతకు సిద్ధంగా ఉన్న టైంలో నేలపాలైన పైరును చూసిన అన్నదాతలు బోరుమంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడవడంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. ఏకంగా 4,47,864 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టుగా వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. ఈ పెను విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొని రైతులు, ప్రజలకు భరోసా ఇచ్చేందుకు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టింది. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో పరిస్థితి ఇప్పుడిప్పుడే కుదటపడుతోంది. ఇళ్లల్లోకి చేరిన బురదను తొలగిస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించిన వివరాల ప్రకారం, తుపాను ప్రభావం రాష్ట్రంలోని 12 జిల్లాల్లోని 179 మండలాలపై పడింది. ఈ నష్టం కారణంగా మొత్తం 2,53,033 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. అత్యధికంగా వరి, పత్తి పంటలకు ఎక్కువగా నష్టం వాటిల్లింది. వరి పంట ఏకంగా 2,82,379 ఎకరాల్లో దెబ్బతినగా, పత్తి పంట 1,51,707 ఎకరాల్లో నష్టపోయింది.నష్ట తీవ్రత జిల్లాల వారీగా పరిశీలిస్తే, ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక నష్టం జరిగింది. ఈ ఒక్క జిల్లాలోనే సుమారు 1,30,200 ఎకరాల్లో పంట దెబ్బతింది. తర్వాత ఖమ్మం జిల్లాలో 62,400 ఎకరాలు, నల్లగొండ జిల్లాలో 52,071 ఎకరాల్లో పంట మునిగింది. ఉమ్మడి మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లోనూ నష్టం తీవ్రంగా ఉన్నట్టు నివేదికలు చెబుతున్నాయి. సంక్షోభంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామని హామీ ఇచ్చారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ప్రాథమిక అంచనాలు అందిన తరువాత, ప్రభుత్వం కీలక నిర్ణయాన్ని ప్రకటించింది. నష్టపోయిన రైతులకు ...మిగతాది 2 లో

## ఢిల్లీలో రోజురోజుకీ క్షీణిస్తోన్నవాయు కాలుష్యం



- వాయు కాలుష్యం రాజధాని ప్రాంత వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది
- ఢిల్లీలో వాయు కాలుష్యం ఎఫెక్ట్.. 75 శాతం కుటుంబాల్లో వైరల్ ఇన్ఫెక్షన్లు
- సర్వేలో సంచలన విషయాలు

**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 31 :**

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకీ క్షీణిస్తోంది. దీపావళి తర్వాత గాలి నాణ్యత ప్రమాదకరస్థాయికి చేరింది. ఢిల్లీఎన్సీఆర్ ప్రాంతంలో ఏక్యూఐ లెవెల్స్ 400కిపైనే నమోదవుతున్నాయి. ఈ వాయు కాలుష్యం రాజధాని ప్రాంత వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. విషపూరిత గాలి ప్రజారోగ్య సంక్షోభానికి దారి తీస్తోంది. గాలి కాలుష్యం కారణంగా ప్రతీ ఇంట్లో ఒకరు ఏదో ఒక అనారోగ్య సమస్యతో సతమతమవుతున్నారు. కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్ లోకల్ సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో కీలక విషయం వెల్లడైంది.ఢిల్లీఎన్సీఆర్ ప్రాంతంలోని దాదాపు 75 శాతం కుటుంబాల్లో కనీసం ఒకరు (ప్రతీ కుటుంబంలో) అనారోగ్యంతో ఉన్నారని తేలింది. ఢిల్లీ, గురుగ్రామ్, నోయిడా, ఫరీదాబాద్, ఘజియాబాద్ నుంచి దాదాపు 15,000కంటే ఎక్కువ కుటుంబాలపై ఈ సర్వే చేశారు. ఈ సర్వేలో అనారోగ్యంతో ...మిగతాది 2 లో

## గెలుపు కోసమే అజారుద్దీన్ మంత్రివర్గంలోనికా..!?

...మిగతాది 2 లో



## భారతీయులపై మరోసారి డొనాల్డ్ ట్రంప్ సర్కార్ అక్కసు

- హెచ్-1బీ దుర్వినియోగమంటూ కార్మిక శాఖ యాడ్ విడుదల

**న్యూఢిల్లీ :**

భారత్‌పై అమెరికా ప్రభుత్వం మరోసారి తన అక్కసును వెళ్లగక్కింది. హెచ్ 1బీ వీసా ప్రోగ్రామ్‌ని కొన్ని కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆరోపిస్తూ అమెరికా కార్మిక శాఖ శుక్రవారం ఓ కొత్త యాడ్‌ని విడుదల చేసింది. అమెరికన్ల ఉద్యోగాలను విదేశీ ఉద్యోగులు ముఖ్యంగా భారతీయులు కొల్లగొడుతున్నట్లు సోషల్ మీడియాలో విడుదల చేసిన వీడియోలో కార్మిక శాఖ ఆరోపించింది. యువ అమెరికన్ల కలలను విదేశీయులు కాజేశారని, హెచ్ 1బీ వీసా ప్రోగ్రామ్‌ని దుర్వినియోగం చేస్తూ యువ అమెరికన్ల స్థానంలో విదేశీ ఉద్యోగులను కంపెనీలు నియమించుకుంటున్నాయని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కార్మిక శాఖ ఆరోపించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, కార్మిక శాఖ మంత్రి లోరీ షావేజ్‌డీరేమర్ నాయకత్వంలో హెచ్ 1బీ వీసాల దుర్వినియోగానికి పాల్పడుతున్న కంపెనీలను జవాబుదారీ చేస్తున్నట్లు పోస్టు పేర్కొంది. అమెరికా ప్రజల అమెరికన్ స్వప్నాన్ని తిరిగి సాకారం చేసుకునేందుకు చర్యలు చేపట్టినట్లు కార్మిక శాఖ పేర్కొంది.అమెరికన్లకు ఉద్యోగాలలో ప్రాధాన్యం ఇవ్వాలన్న ట్రంప్, షావేజ్ నినాదాన్ని ప్రస్తావించింది. హెచ్ 1బీ వీసా ప్రోగ్రామ్‌పై ఆడిట్‌ని కార్మిక శాఖ చేపట్టిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

మొదటిపేజీ తరువాయి

## ఎవ్వరూ అధైర్య పడవద్దు

ఎంత పరిహారం ఇవ్వాలన్న దానిపై సీఎంతో చర్చించిన తర్వాతనే తుది నిర్ణయం ప్రకటిస్తామని మంత్రి తుమ్మల వెల్లడించారు. తక్షణ సాయంగా రూ.10 వేల పరిహారాన్ని మంత్రి ప్రకటించారు. పంట పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో లక్షల ఎకరాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. వరి కోత సమయంలో నేలకొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి పూర్తిగా తగ్గుతుందనే భయం వారిని వెంటాడుతోంది. కల్లాల్లో, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం సైతం కొట్టుకుపోవడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో ఒక మహిళా రైతు వీడియోను షేర్ చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన తారవ్వ అనే మహిళా రైతు అధికారుల కాళ్లు పట్టుకుని ఆవేదన వ్యక్తం చేయడం, ఈ భారీ వర్షాలు రైతులకు ఎంతటి నష్టాన్ని మిగిల్చాయో అర్థం చేసుకోవడానికి ఒక నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేల పరిహారం ఏ మాత్రం సరిపోదని పేర్కొన్నారు. ఆరుగాలం కష్టం నీటిపాలైన రైతులను ఆదుకోవాలంటే, ఒక్కో ఎకరాకు కనీసం రూ.50 వేల పరిహారం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. కేవలం పరిహారం మాత్రమే కాకుండా, ఈ కష్టకాలంలో రైతులకు ప్రభుత్వం అదనపు భరోసా కల్పించాలని ఆమె అభిప్రాయపడ్డారు. యాసంగి పంటల సాగు కోసం రైతులకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు అందించాలని, తక్షణమే రైతు భరోసా సాయాన్ని విడుదల చేయాలని కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు.

**ముఖ్యమంత్రి క్షేత్రస్థాయి పర్యటన**

తుపాను బాధితులకు భరోసా ఇచ్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగంలోకి దిగారు. సీఎం పర్యటన తుపాను ప్రభావిత జిల్లాల్లో జరుగుతుందని మంత్రి తుమ్మల గతంలోనే ప్రకటించారు. దానిలో భాగంగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు గ్రేటర్ వరంగల్‌లో విస్తృతంగా పర్యటించాన్నారు. హైదరాబాద్ బేగంపేట నుంచి మధ్యాహ్నం 12:45 గంటలకు బయలుదేరిన సీఎం, ముందుగా హుస్నాబాద్, వరంగల్‌లో వరద దెబ్బతిన్న ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు ఆ తర్వాత, వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు మధ్యాహ్నం 1:45 గంటలకు చేరుకున్నారు. అక్కడ నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి వరంగల్ నగరంలోని మూడు ప్రధాన కాలనీలలో పర్యటించారు. ముంపుకు బాధితులతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు.

## ఢిల్లీలో రోజురోజుకీ క్షీణిస్తోన్నవాయు కాలుష్యం

బాధపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగినట్లు తేలింది. నాలుగు కుటుంబాలకు గానూ మూడు కుటుంబాల్లో ఎవరో ఒకరు అనారోగ్యంతో బాధపడుతున్నారు. శ్వాసకోశ సమస్యలు, దగ్గు, గొంతు నొప్పి, ముక్కు దిబ్బడ, కళ్ల మంటలు, తలనొప్పితో ఇబ్బందిపడుతున్నారు.గత నెల చివరిలో అంటే సెప్టెంబర్ చివరిలో దాదాపు 56 శాతం ఇండ్లలో ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది అనారోగ్య సమస్యలను నివేదించగా.. అక్టోబర్ చివరికి ఆ సంఖ్య 75 శాతానికి పెరిగింది. దాదాపు 17 శాతం కుటుంబాల్లో నలుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఉన్నారు. 25 శాతం కుటుంబాల్లో ఇద్దరు నుంచి ముగ్గురు అనారోగ్య సభ్యులు ఉన్నారు. 33 శాతం కుటుంబాల్లో ఒక వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతుండగా.. 25 శాతం కుటుంబాలు మాత్రమే అందరూ ఆరోగ్యంగా ఉన్నారని ఈ సర్వేలో తేలింది.

**పెరుగుతున్న వైరల్ ఇన్ఫెక్షన్ కేసులు**

రాజధాని అంతటా H3N2 ఫ్లూ (H3N2 influenza), ఇతర వైరల్ ఇన్ఫెక్షన్ల కేసుల్లో స్థిరమైన పెరుగుదల కనిపిస్తోందని వైద్యులు తెలిపారు. ప్రతి ఒక్కరిలో దీర్ఘకాలిక జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, అలసట, ఒళ్లు నొప్పులు, శ్వాసకోశ ఇబ్బందులు వంటి లక్షణాలు ఉన్నాయని చెప్పారు. వారు కోలుకునేందుకు కూడా చాలా సమయం పడుతోందని వివరించారు. ఈ వైరల్ ఇన్ఫెక్షన్లు పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారినే ఎక్కువగా ప్రభావితం చేస్తున్నట్లు తెలిపారు.

## అజారుద్దీన్ అనే నేను

బీకాం పూర్తి చేశారు. 1984లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగు పెట్టి ప్రత్యేకమైన స్టైల్‌తో గుర్తింపు తెచ్చారు. అరంగేట్రం చేసిన తొలి మూడు టెస్టుల్లోనే సెంచరీలతో అప్పట్లో రికార్డుల మోత మోగించారు. అరంగేట్రం చేసిన ఐదేళ్లకే టెస్టు కెప్టెన్ అయ్యారు. 16 ఏళ్లపాటు క్రికెట్ ఆడిన అజారుద్దీన్ అద్భుతమైన విజయాలు సొంతం చేసుకున్నారు. తర్వాత అనూహ్యమైన మ్యాచ్‌ఫిక్స్ కేసులో ఇరుక్కొని ఆటకు దూరమయ్యారు. 2009లో కాంగ్రెస్ పార్టీలో చేరిన అజారుద్దీన్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని మొరాదాబాద్‌లో ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. తర్వాత తెలంగాణలో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఈ మధ్య ఆయన్ని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీగా మండలికి పంపించింది. ఇప్పుడు మంత్రి పదవితో గుర్తింపు తీసుకొచ్చింది.

## పంటపొలాల్లో యుద్ధప్రాతిపదికన నీటి నిల్వలు మళ్లింపు

స్పష్టం చేశారు. నియోజకవర్గం వారీగా శాటిలైట్ చిత్రాలను విడుదల చేసి... ఎక్కడైతే నీళ్లు నిలిచిపోయాయో అక్కడికి స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు వెళ్లి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. అందరూ కలిసి సమన్వయంతో పని చేయడం ద్వారా క్షేత్ర స్థాయిలో ఫలితాలు రాబట్టాలని సీఎం సూచించారు. శాస్త్రవేత్తల సూచనలు తీసుకుని... పంటలు నీట మునగడం వల్ల దిగుబడి తగ్గకుండా తగు విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కన్నా ఎక్కువగా 60 శాతం మేర బాపట్ల జిల్లాలోని వ్యవసాయ క్షేత్రాల్లో నీరు నిలిచిపోయిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బాపట్ల జిల్లాలో మాత్రం ఆదివారం నాటికి నీటి నిల్వలు లేకుండా చేస్తామని విన్నవించారు.

**కేంద్రాన్ని తక్షణ సాయం కోరండి**

మొంథా తుఫాన్‌తో రాష్ట్రానికి జరిగిన నష్టంపై కేంద్రానికి వెనువెంటనే ప్రాథమిక నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలనకు కేంద్ర బృందాన్ని ఆహ్వానించాలన్నారు. తుది నివేదిక సమర్పించేలోగా తక్షణ సాయం అందించేలా కేంద్రాన్ని కోరాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ విషయమై తాను ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడతానని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే కృష్ణా నదిలో ప్రస్తుతం కొనసాగుతున్న నీటి నిల్వల వివరాల గురించి ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అయితే కృష్ణాలో వరద ఉధృతి తగ్గిందని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. అలాగే మొంథా తుఫాన్ రక్షణ చర్యల్లో అత్యుత్తమంగా పనిచేసిన వారిని సన్మానించాలని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు. శనివారం ఉదయం 10 గంటలకు సుమారు 100 మందిని గౌరవించుకునేలా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాలని చెప్పారు.

## ఖమ్మంలో దారుణం

■ **సీపీఎం నేత దారుణ హత్య**

జయభేరి, ఖమ్మం:

ఖమ్మం జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. సీపీఎం రైతు సంఘం నేత సామినేని రామారావును గుర్తుతెలియని దుండగులు అత్యంత పాశవికంగా హత్య చేశారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతుడు సామినేని రామారావు రోజూ మాదిరిగానే ఉదయం వాకింగ్కు వెళ్లారు. ఆ సమయంలో మార్గమధ్యంలో ఆయన్ను అడ్డగించిన దుండగులు, పదునైన ఆయుధంతో గొంతుకోసి హతమార్చారు. రక్తపు మడుగులో పడివున్న ఆయన్ను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిసరాలను పరిశీలించి, సాక్ష్యాధారాలను సేకరించే పనిలో పడ్డారు. హత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఈ హత్య వెనుక రాజకీయ లేదా వ్యక్తిగత కక్షలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో పాతర్లపాడు గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# గెలుపు కోసమే అజారుద్దీన్ మంత్రివర్గంలోనికా..!?

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రసవత్తరంగా సాగనుంది. ఇందులో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డి ఏకంగా ముస్లిం మైనారిటీ ఓటర్లను రాబట్టుకునేందుకు మాజీ క్రికెటర్ అజారుద్దీన్ ని ఎమ్మెల్సీ ద్వారా మంత్రివర్గంలోనికి తీసుకునే విధంగా రెడ్డి రాజకీయం విజయవంతంగా ముందుకు సాగింది. సామాజిక రాజకీయ కోణం నుంచి ఆలోచిస్తే జూబ్లీహిల్స్ ఓటర్ల సంఖ్య 3 లక్షల పైన ఉంటుంది. అందులో లక్ష పైన ముస్లిం మైనారిటీ ఓటర్ల సంఖ్య ఉంది..**



జయభేరి, హైదరాబాద్ :

లక్ష ఓటర్లను ఏకతాటిగా ఒక్క ఓటు కూడా మిస్ అవ్వకుండా సీఎం రేవంత్ రెడ్డి తన రాజకీయ అనుభవానికి పదును పెట్టి అజారుద్దీన్ మంత్రివర్గంలోకి తీసుకునే పథకానికి తెర లేపారు. దీంతో ఇక్కడ సీటు పోగొట్టుకుంటుందా అనే రీతిలో బి ఆర్ ఎస్ పార్టీ ఏం చేయాలో తోచక అయోమయంలో పడిపోయింది. ఇక బిజెపి పార్టీ కిషన్ రెడ్డి మెడ మీద కత్తిలా మారిపోయింది. కింద మీద పడి బిజెపిని ఇక్కడ గెలిపించుకుంటే అవకాశాలు ఎక్కువగా వచ్చేది కిషన్ రెడ్డికే.. ఎందుకంటే రాజకీయ సమీకరణాలు తెలంగాణ రాష్ట్రంలో ఏది ఏమైనా కిషన్ రెడ్డికి పెద్ద ముప్పు వచ్చేది ఏమీ లేదు. రాజకీయాలు ఎటువైపు తిరిగిన కిషన్ రెడ్డికి కచ్చితంగా ఏదో ఒక పదవి రాష్ట్రంలో బిజెపి పార్టీ అందిస్తూ వస్తూనే ఉంది. అంతగా కిషన్ రెడ్డి ఏ మంత్రం వేశాడో అది బిజెపి పార్టీ నాయకులకే తెలియాలి.

ఇకపోతే కాంగ్రెస్ పార్టీ నవీన్ యాదవ్ ఇప్పటికే వాళ్ళ తండ్రి పై బైండోవర్ జరిగిందని వార్తలు విన్నం. ఇలా సెంట్రల్ బిజెపి పార్టీ ఎన్ని పన్నాగాలు పండిన జూబ్లీహిల్స్ ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని నమ్మడానికి సంకేతాలు గానే ముస్లిం మైనారిటీ ఓటర్లను తమ వలలు వేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ అజారుద్దీన్ మంత్రివర్గంలోకి తీసుకోనుంది.. గత చరిత్ర చూసుకుంటే ముస్లిం మైనారిటీ ఓట్లన్నీ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగానే ఉన్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు మాత్రం సీఎం రేవంత్ రెడ్డికి కొంత కలవరాన్ని తెచ్చి పెట్టినట్టుగా అనిపించే అజారుద్దీన్ మంత్రివర్గంలోకి తీసుకున్నారని వార్తలు గుప్పుమంటున్నాయి. ఏది ఏమైనా కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఉప ఎన్నికల్లో ప్రచారం కోసం తిరగబోతున్నారు. ఇప్పటికే మంత్రిగనం మొత్తం జూబ్లీహిల్స్ లో పూర్తిగా ప్రచారంలో జోరుగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి ప్రచారంలోకి దిగేలోపే మంత్రివర్గంలోకి అజారుద్దీన్ ని తీసుకోవడం రాజకీయంగా కొంత పట్టు సాధించిందని చెప్పవచ్చు.. అధికారం కోసం ఎవ్వరైనా ఇలా చేయాల్సిందే.. ఎందుకంటే భారతదేశం ఎప్పుడో ప్రజా సంక్షేమం వదిలేసి ఓటు రాజకీయ కోణంగా ముందుకు వెళుతుంది.. మన కులం వాడైతే గెలిచే అవకాశం ఎక్కువగా ఉంటుంది... అనే విధంగా కుల రాజకీయాలు బాగానే జోరందుకుంటున్నాయి. ఇక ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ మేము ఇచ్చినప్పటికీ బిజెపి పార్టీ అడ్డుకుంది అని చెప్పే రాజకీయ వాగ్దానాల్లో బాగానే విజయం సాధించింది. కానీ అసలు బీసీ బంద్ ఎవరు ఎవరిపై చేశారు అర్థం కాకుండా నవ్వులపాలుగా బీసీ బంద్ జరిగిపోయింది.



కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక కచ్చితంగా అధికార పార్టీ గెలుస్తుందని నమ్మకం 80% కనిపిస్తున్నప్పటికీ అటు బి ఆర్ ఎస్ పార్టీ ఇటు బిజెపి పార్టీ రెండు పోటా పోటీగా ఎన్నికల ప్రచారం బాగానే కొనసాగిస్తున్నారు.. అన్నిటికంటే మించి రెడ్డి రాజకీయం ముందు ప్రతిపక్షాలుగా ఉన్న రాజకీయ పార్టీలు ఏం చేయాలో తోచక ఎడాపెడ వాగ్దానాలను అందించిన అవి ఏనాటికి అమలు కావనే ఆలోచన జూబ్లీహిల్స్ ఓటర్లకు ముందే తెలిసిపోయింది. ఏకంగా అజారుద్దీన్ మంత్రివర్గంలోకి తీసుకున్న నాటినుండి ముస్లిం మైనారిటీ ఓట్లన్నీ గంపగుత్తగా కాంగ్రెస్కు పడే విధంగా రాజకీయం ఎప్పుడో జరిగిపోయింది. రెడ్డి రాజకీయం ముందు వెలమ రాజకీయం కూడా చచ్చుబడిపోయిందనే చెప్పాలి.. రానున్న ఉప ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుందో ప్రజలే నిర్ణయిస్తారు కాబట్టి ఏ పార్టీ అయినా తొందరపడితే బోర్లా పడక తప్పదు మరి.

# నీటిలో మునిగితే అది స్నానం. నీలో మునిగితే అది ధ్యానం..!



Dr. హరి హర నాద రాజు
శంబాలా 360 సోలుషన్స్
9177 445 591
www.shambala360solutions.com




నీలోకి నీవు మునిగిపోవడం నీళ్ళలో మునిగినంత తేలిక కాదు. స్నానానికి సాధనతో పని లేదు. ధ్యానానికి సాధన తప్ప వేరే దారి లేదు. ధ్యానం కుదరడం లేదని ఫిర్యాదు చేసే చాలా మంది చెరువు గట్టున నిలబడి చూసేవారే కాని, నీళ్లలోకి దిగినవారు కారు. తన వద్ద శిష్యరికం చేసిన పూర్వ విద్యార్థిని పిలిపించి బుద్ధుడు ధ్యానం గురించి అడిగాడు. శిష్యుడికి అది రెండో ఎక్కం లాంటిది. రకరకాల ప్రక్రియలు, ధ్యాన దశల గురించి అప్పటికే విశేషంగా చదివి ఉన్నాడు. పరిశోధనలు చేశాడు. ఆ విద్యలో గట్టి పాండిత్యం సాధించాడు. కనుక బుద్ధుడు అడిగీ అడగ్గానే ఎన్నో సాధనా విధానాలను గడగడా వల్లించాడు. బుద్ధుడు శిష్యుడి కేసి ప్రసన్నంగా చూస్తూ 'మంచిది భిక్షూ ! ఇక ధ్యాన సమయంలో నీవు పొందిన అలౌకిక అనుభూతులను కొన్నింటిని వివరించు' అని అడిగాడు. తెల్లబోయాడు శిష్యుడు. నోట మాట రాలేదు. ఎవరికైనా ధ్యానం గురించి పాఠం చెప్పడానికి తగినంత పరిజ్ఞానాన్ని సాధించావే తప్ప నీవు నిజమైన ధ్యానివి కాలేకపోయావు' లోకంలో సాధకులమనుకునే వారిలో చాలా మందిది ఇదే పరిస్థితి.

నిజానికి ధ్యానమంటే గాఢమైన అనుభూతే తప్ప, ఆలోచన కానే కాదు. ధ్యానంలో ఆలోచించడానికి ఏమీ లేదు. వెదురుబొంగు లోపల దట్టంగా అలముకున్న గుజ్జు, పోగులు పూర్తిగా కాలిపోయి, ఖాళీ అయ్యాక వేణువు కావడానికి సిద్ధమవుతుంది. ముసురుకున్న ఆలోచనలను తుడిచేశాక, ధ్యానం తానుగా మనసులోకి వచ్చి చేరుతుంది. ఆపై నెమ్మదిగా గుండెల్లో ప్రశాంతత ఆవరిస్తుంది. ఆనందం వరిస్తుంది. శరీరం గొప్ప శక్తి కేంద్రమై తరిస్తుంది. ఈలోగానే ఆలోచనలు తిరిగి దాడి చేస్తాయి. పాత జ్ఞాపకాలు తరుముకొస్తాయి. అవి చాలా బలమైనవి. వాటిని ప్రతిఘటిస్తే మనిషి విఫలమవుతాడు. పారిపోతే దొరికిపోతాడు. వాటితో ఘర్షణ వృథా ! సాధకుడు వాటిని స్వేచ్ఛగా లోనికి అనుమతించాలి. చిరునవ్వుతో పలకరించాలి.

ఆలోచనలకు దారివ్వడమంటే మనసును మచ్చిక చేసుకోవడమని అర్థం. ఆ సాక్షీభూత స్థితిలో మనిషికి, మనసుకు మధ్య స్నేహం కుదురుతుంది. ఆలోచనలనేవి ఎప్పుడూ స్థిరంగా ఉండవు. వేగంగా కదిలిపోతూ ఉంటాయి. వాటంతటవి తొలగిపోయేవరకు మనిషి ఓపిక పట్టాలి.

ఆ సంధి సమయంలో మనిషికి సహనమే గొప్ప వరం. ధ్యానం కోసం వేచి చూసే స్థితికి చేరుకోవడం విజయంలో తొలిమెట్టు. ఆ స్థితిలో మనసులోకి వచ్చిపోతున్నా పట్టించుకోని విషయాలే స్వయంగా మనిషిని ధ్యానంలోకి తోసేస్తాయి. పరిశీలనలోంచి మనసును అనుభూతిలోకి, ఆస్వాదనలోకి నెట్టేస్తాయి. లీలగా మనిషి ధ్యానంలో లీనమవుతాడు. సాధన క్రమంలో ఒళ్ళు జలదరించడం, ఆవలింతలు రావడం, అకారణమైన ఆనందమేదో గుండె తలుపు తట్టడం గాని జరిగితే అవన్నీ ధ్యానంలో పురోగతికి సూచనలని మనం గ్రహించాలి. శంభాల 360 సొల్యూషన్ చెప్పినట్లు వాటి ప్రోత్సాహంతో మరింత లోతులకు ప్రయాణం సాగించాలి. ఆ అనుభూతులు వాటంతటవే రావాలి తప్ప మనం ఎదురు చూడకూడదు, వాటికోసం ప్రయత్నించ కూడదు. వైకుంఠపాళిలో నిచ్చెనల్లాంటివవి. ధ్యానానికి గమ్యం ఆ నిచ్చెనలు కావు... పరమపద సోపానం !

# విద్యార్థిని ఆత్మహత్యాయత్నం బాధాకరం

- విద్యార్థిని ఆత్మహత్యాయత్నంకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి
- గురుకుల, పాఠశాల విద్యను సంక్షోభంలోకి నెట్టిన ప్రభుత్వం
- 23 నెలల్లో 110 మంది విద్యార్థుల మరణం
- పాలన గాలికొదిలేసి నేరపూరిత నిర్లక్ష్యంతో విద్యార్థులను పొట్టన బెట్టుకుంటున్న ముఖ్యమంత్రి
- విద్యార్థులు ఇబ్బందుల పాడుతున్న ఒక్క సమీక్ష కూడా నిర్వహించని ప్రభుత్వానికి ఉసురు తప్పదు
- రాష్ట్రంలో గురుకుల విద్యావ్యవస్థ కుప్పకూలింది
- కేసీఆర్ హయాంలో గురుకుల విద్యావ్యవస్థ ఆదర్శంగా నిలిచింది
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గురుకులాల వ్యవస్థను నీరు గారుస్తున్నారు
- గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ విద్యార్థులు ఎక్కువగా చదువుతున్నారు



జయభేరి, దేవరకొండ : విద్యార్థిని ఆత్మహత్యాయత్నం బాధాకరం అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డేటల్ తాగి ఆత్మహత్య చేసుకున్న గిరిజన బాలికల గురుకుల పాఠశాల తిరుమలగిరి(సాగర్) మండలం జివి చెట్టు తండాకు చెందిన 10వ తరగతి విద్యార్థిని మాధవి ని అయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని ఆత్మహత్యాయత్నంకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి అని ఆయన డిమాండ్ చేశారు.23 నెలల్లో 110మంది విద్యార్థుల మరణించడం జరిగింది అని తెలిపారు. పాలన గాలికొదిలేసి నేరపూరిత నిర్లక్ష్యంతో విద్యార్థులను పొట్టన బెట్టుకుంటున్న ముఖ్యమంత్రి అని అన్నారు. రాష్ట్రంలో 2000మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్ కు గురి అయ్యారు అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి తెలంగాణలో విద్యా శాఖకు మంత్రి లేరు అని అన్నారు.రాష్ట్రంలో గురుకుల విద్యావ్యవస్థ కుప్పకూలింది అని అన్నారు.కేసీఆర్ హయాంలో గురుకుల విద్యావ్యవస్థ ఆదర్శంగా నిలిచింది అని గుర్తు చేశారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గురుకులాల వ్యవస్థను నీరు గారుస్తున్నారు అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ విద్యార్థులు ఎక్కువగా చదువుతున్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, రమావత్ రమేష్, బిఆర్ఎస్వీ దేవరకొండ మండల అధ్యక్షుడు పాత్లవత్ లక్ష్మణ్, జనీబాబా, యువజన విభాగం పట్టణ అధ్యక్షులు పొట్ట మదు, బాబా, అఫ్రోజ్,వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలి

- ప్రభుత్వం వెంటనే రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి
- మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

జయభేరి, దేవరకొండ : నల్గొండ జిల్లా వ్యాప్తంగా మెంథా తుపానుతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది అని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి, లేదంటే ఉద్యమం చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ తుపాన్ ఊహించలేనిది, రైతులకు జరిగిన నష్టం మాటల్లో చెప్పలేనిది అని ఆయన అన్నారు.ధాన్యం తడిసిపోవడం, పంటలు నేలరాలిపోవడం, వరదల్లో కొట్టుకుపోవడం చూసి రైతులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు అని ఆయన పేర్కొన్నారు.ఆరుగాలం శ్రమించి కోతకు సిద్ధమైన పంట నీటిపాలైందని, రైతుల కష్టం వృథా అయిందని పేర్కొన్నారు. రైతుల బాధ వర్ణనాతీతమని, వారిని మానవతా దృక్పథంతో ఆదుకోవాలి అని ప్రభుత్వాన్ని కోరారు.యూరియా, విత్తనాలు దొరకక, రైతు భరోసా ఆలస్యమై, ఇప్పటికే రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులను నిజంగా ప్రేమిస్తే, వెంటనే నష్టపరిహారం రైతుల అకౌంట్లలో జమ చేయాలి అని డిమాండ్ చేశారు.మెంథా తుపాను రైతులకు కన్నీరు మిగిల్చిందని, వారిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఘనంగా ముగిసిన సబ్ జూనియర్ జిల్లా ఆర్చరీ పోటీలు





జయభేరి, పరవాడ: ఉమ్మడి జిల్లా అర్చరీ సంఘం ఆధ్వర్యంలో సంస్కృతి గ్లోబల్ స్కూల్ నందు జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్ ఆర్చరీ పోటీలు సంస్కృతి గ్లోబల్ స్కూల్ లో జరిగాయి.ఈ పోటీలను జిల్లా నలుమూలల నుండి సుమారు 60 మంది క్రీడాకారులు హాజరై పోటీలలో పాల్గొన్నారు. వీరిలో రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు రేపటి నుండి విజయవాడలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారనిజిల్లా ఆర్చరీ ప్రధాన కార్యదర్శి కె. నిశాంత్ తెలిపారు.ఈ పోటీలలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు జిల్లా అర్చరీ సంఘ ఉప అధ్యక్షులు సత్య నారాయణ అభినందనలు తెలుపుతూ రాష్ట్ర స్థాయిలో కూడా రాణించాలని అభిలాశించారు.

## తుఫాన్ వర్షాల కారణంగా దెబ్బతిన కోర్టు భవనాలు

జయభేరి, దేవరకొండ : న్యాయస్థానంల భవన సముదాయములను నల్లగొండ ఇంచార్జి జిల్లా జడ్జ్ సంపూర్ణ ఆనంద్ ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన తుఫాన్ వర్షాల కారణంగా దెబ్బతిన కోర్టు భవనాలను పరిశీలించారు. ఈ క్రమంలో న్యాయవాదుల, కోర్టు సిబ్బందిలను వివరాలు అడిగి తెలుసుకున్నారు వారి వెంట సీనియర్ సివిల్ జడ్జ్ కె అనిత ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ KVS హరీష్ బాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ కొండమల్లేపల్లి శాఖ ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమం

- పెండింగ్ లో ఉన్న 8500కోట్ల స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి





జయభేరి, కొండమల్లేపల్లి : ఏబీవీపీ కొండమల్లేపల్లి శాఖ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి నగరంలో భిక్షాటన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ నల్గొండ విభాగ్ హాస్టల్స్ కన్వీనర్ యలమల గోపీచంద్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పాలకులు మారిన ప్రజల బ్రతుకులు మారడం లేదని గత పాలకులు విద్యారంగాన్ని పూర్తిగా విధ్వంసం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం సైతం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ మరింత విధ్వంసం చేస్తుందని పేద మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువు కోసం సంజీవని లాంటి ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని ఈ ప్రభుత్వం తూట్లుపొడిచే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు అని. గత మూడు సంవత్సరాలుగా దాదాపు రూ.8500 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్లో ఉన్నా ఈ ప్రభుత్వం నిమ్మకు నీలెత్తినట్లు వ్యవహరిస్తున్న తీరును ఏబీవీపీ తీవ్రంగా ఖండిస్తుంది. రాష్ట్రంలో స్కాలర్షిప్స్, రీయింబర్స్మెంట్ పై ఆధారపడి దాదాపు 15 లక్షల మందికి పైగా విద్యను అభ్యసిస్తున్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం స్కాలర్షిప్స్ ఇవ్వకుండా ఫీజు రీయింబర్స్ విడుదల చేయకుండా పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టే కుట్ర చేస్తుంది. పేద విద్యార్థులపై ప్రభుత్వ కుట్రలు ఆపి వెంటనే పెండింగ్లో ఉన్న 8500 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్షిప్ లను విడుదల చేయాలనీ ఏబివిపి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తుంది విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి చేపూరి కార్తీక్, దినేష్, విక్రమ్, చందు, వంశీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## శిధిలమైన రోడ్లు వెంటనే నిర్మాణం చేపెట్టాలి

- సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి డిమాండ్





జయభేరి, పరవాడ: పరవాడ మండల కేంద్రమైన పరవాడ సినిమా హాల్ జంక్షన్లో శిధిలమైన రోడ్లను వెంటనే నిర్మాణం చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ లంకెలపాలెం నుండి పరవాడ, ఉక్కు నగరం నుండి పరవాడ, పరవాడ నుండి వాడ చీపురుపల్లి, అచ్యుతాపురం రోడ్లు శిథిలమై భారీ గోతుల్లో ద్విచక్ర వాహనదారులు, కార్లు, ఆటోలు పడి ప్రమాదాలు కి గురవుతున్నారని అన్నారు. వెంటనే రోడ్ల నిర్మాణంకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హిందూజా బొగ్గు లారీలు అధికలోడలతో ఈ మార్గం నుండి ప్రయాణించడం వలన రోడ్లు శిధిలైవస్తకి గురవుతున్నాయని వెంటనే ఆర్టీవో పోలీస్ అధికారులు ఈ బొగ్గు లారీలపై కేసులు నమోదు చేయాలని గని శెట్టి డిమాండ్ చేశారు. రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసి రోడ్ల నిర్మించాలని డిమాండ్ చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు పరవాడలో అట్టహాసంగా గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. తూతూ మంత్రంగా గుంతలు పూరచడం కాకుండా రోడ్ల నిర్మాణం పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని గని శెట్టి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భారీ ఎత్తున ఆందోళన చేపట్టవలసి వస్తుందని గని శెట్టి హెచ్చరించారు. హిందూజా బొగ్గు లారీలను ఈ మార్గం గుండా రాకుండా అధికారులు నిలుపుదల చేయాలని అధిక లోడ్లు వేస్తున్న బొగ్గు లారీ యాజమాన్యాలపై కేసులు నమోదు చేయకపోతే ప్రజాసంఘాలుగా మేమే అడ్డుకుంటామని గని శెట్టి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొల్లి అప్పారావు, గండి శ్రీనివాసరావు, బి అప్పలనాయుడు, సిహెచ్ వెంకనాయుడు, రెడ్డి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యతోనే ఉన్నత స్థాయికి ఎదుగుదల సాధ్యం

- విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో పవర్ గ్రిడ్ సంస్థ చీఫ్ మేనేజర్ పి రాజు





జయభేరి, పరవాడ: నేటి విద్యార్థులు నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఉక్కునగరం పవర్ గ్రిడ్ సంస్థ చీఫ్ మేనేజర్ పి రాజు పిలుపునిచ్చారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పరవాడ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు విజిలెన్స్ మనందరి సంయుక్త భాద్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 25 మంది విద్యార్థినిలు పాల్గొనగా అందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు గాను టీ.కారుణ్య , ఎన్.దీక్షిత , బి.పూజిత ఎంపిక కాగా , జి.దీక్షిత ప్రియ మరియు జి.దుర్గ ప్రోత్సాహక బహుమతులు గెలుపొందారు.వీరికి పవర్ గ్రిడ్ సంస్థ చీఫ్ మేనేజర్ పి.రాజు చేతులు మీదుగా బహుమతులు ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజశ్రీ, ఉపాధ్యాయినులు నాగ లక్ష్మి, కుమారి పవర్ గ్రిడ్ సంస్థ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, పైల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



## శిశువిక్రయాలు జరిగితే కఠిన చర్యలు

జయభేరి, దేవరకొండ : శుక్రవారం ముదిగొండ సెక్టార్ పరిధిలోనీ వివిధ అంగన్వాడీ కేంద్రాల్లో శిశువిక్రయాలు జరుగుతే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ సూపర్వైజర్ డి చిట్టెమ్మ అన్నారు గ్రామాలలో గర్భిణీ, బాలింత గృహాలను సందర్శించి వారి కుటుంబ సభ్యులకు తగు సూచనలు ఇచ్చారు, పూతలరాం తండా అంగన్వాడి కేంద్రం నందు అవగాహన సదస్సు నిర్వహించి తల్లులకు లింగ వివక్షత చూపకుండా పుట్టిన ప్రతి బిడ్డను జాగ్రత్తగా చూసుకోవాలి, చదివించాలి అని తెలియపరచడం జరిగినది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ రూప్లి, శాంతాబాయి, పద్మ, సునీత, విజిత ధోళి, రమణ,తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి వేడుకలు



జయభేరి, చందంపేట : జిల్లా పరిషత్ హై స్కూల్ చందంపేట పాఠశాలలో ఘనంగా జరిగిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలలో ప్రధానోపాధ్యాయులు ఇంచార్జ్ ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ 562 సంస్థానలను భారతదేశంలో విలీనం చేసి, తొలి ఉప ప్రధానిగా, హోంశాఖ మంత్రిగా విశాల భారతావని ఏకం చేసిన వ్యక్తి అని ప్రశంసించారు. ఈరోజును ఏకతా దినోత్సవం గా జరుపుకుంటూ భారతదేశ ఐక్యతను కాపాడుదామని ఉపాధ్యాయులు విద్యార్థులు ప్రతిజ్ఞ చేసినారు. ఈ కార్యక్రమములో ఉపాధ్యాయులు గోవిందు కొండయ్య, జోసెఫ్ చౌదరి ,ఎల్ మధు, విజయ సంధ్యారాణి వెంకట్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

## స్వర్గీయ సర్దార్ వల్లభాయ్ పటేల్150వ జయంతి వేడుకలు





జయభేరి, దేవరకొండ : స్థానిక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సేవాదనం నందు ఈ రోజు అఖండ భారత్ ప్రధాత, దేశ మొదటి హోం మంత్రి స్వర్గీయ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి కార్యదర్శి, కోశాధికారి అంకం చంద్రమౌళి, పంగనూరు లింగయ్య పూలమాల అలంకరించి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షలు, కార్యనిర్వాహక కార్యదర్శి ఆకులపల్లి ఐజాక్, మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, పడమటి శాంతకుమారి మాట్లాడుతూ నేటి అఖండ భారత్ నిర్మాణమునకు ముఖ్య కారకులు మన మొదటి హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, సహా అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి,సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య,కార్యవర్గ సభ్యులు జంపాల యాదగిరి, మునిని వీరయ్య, యస్ పెద్దులు, మునిని వీరయ్య, అలంపల్లి శ్రీనివాసులు, గోకికర్ ప్రభాకర్ తదితరులు నివాళులు అర్పించినారు.

## శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవాలయంలో భజన కార్యక్రమం



జయభేరి, దేవరకొండ : శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిత్య భజనలు కార్యక్రమంలో భాగంగా తేలుకుంట్ల రవి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం వైభవంగా నిర్వహించినారు. ప్రతిరోజు భజనలు చేయాలని మంచి సంకల్పంతో ఆలయంలో ప్రతిరోజు భజనలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తేలుకుంట్ల రవి, ఆలయం కోశాధికారి కొత్త సుబ్బారావు, ఇడుకుల పుల్లయ్య, అర్థం మల్లేష్, పంగునురు శ్రీనివాసులు, గుద్దేటి సత్యం, నీల అశోక్, బిక్కుమాల్ల కోటయ్య, ఊరుకొండ సత్యనారాయణ, ఊరుకొండ సంతోష్, నేలటి కిరణ్, ఆలంపల్లి మురళి, ఊరుకొండ ప్రశాంత్, మిర్యాల దర్శన్, సముద్రాల చంద్రశేఖర్, గందె కృష్ణయ్య, ఆలంపల్లి సూరయ్య, కల్వ తిరుపతయ్య, గందె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రోజు జాతీయ గీతాలపన

జయభేరి, చింతపల్లి : చింతపల్లి లో ప్రతి రోజు చింతపల్లి మండల ఆర్యవైశ్య సంఘం వందనపు ఆంజనేయులు ఆధ్వర్యంలో జాతీయ గీతాలాపన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈరోజు జాతీయ గీతాలపన కార్యక్రమం నిర్వహించినారు ఈరోజు మాతృశ్రీ స్కూల్ యాజమాన్యం సహకారంతో జాతీయ గీతాలపన, మానవహారం నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో దాచేపల్లి మధు, ఆగీరు రవీందర్, తేరటుపల్లి కిషోర్, కుంచకూరి రాము, అగుదోట జంగయ్య, నామని శ్రీనివాస్, బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకులు చెనమోని రాములు, నాయకులు అంభేద్కర్ యువజన సంఘంనాయకులు ఎర్ర వెంకటయ్య పోలీస్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైన బీసీ రిజర్వేషన్లను సాధించుకుంటాం

■ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

జయభేరి, ఆలేరు :



ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద నిర్వహించిన బీసీ కులాల చట్టసభలలో రిజర్వేషన్ల సాధనకై ధర్మదీక్ష కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మరియు రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. బీసీలకు చట్టసభల్లో 42% రిజర్వేషన్ కల్పించే బిల్లును తెలంగాణ ప్రభుత్వం చట్టం చేసి కేంద్రానికి పంపినప్పటికీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆ బిల్లును అడ్డుకుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, "బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు లభిస్తే, విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో బీసీ బిడ్డలకు పెద్ద ఎత్తున అవకాశాలు లభిస్తాయి. బీసీ రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీలు ఏకమై ముందుకు రావాలి" అన్నారు. అలాగే ఆయన, బీసీ రిజర్వేషన్ బిల్లు విషయంలో కాంగ్రెస్ పార్టీకి పేరు రాకుండా చూడాలనే ఉద్దేశంతో బీజేపీ బిల్లును అడ్డుకుంటోందని ఆరోపించారు. విద్యావంతులు, విద్యార్థులు, మేధావి వర్గం బీసీ సమాజాన్ని మేల్కొల్పే బాధ్యత తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, "బీసీ బిల్లు కోసం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద దీక్ష చేపట్టినా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టుగా కూడా లేదు. బీసీలు అంటే వెనుకబడ్డ వారు కాదు.. వెనుకకు నెట్టి వేయబడినవారు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు వాకాటి శ్రీహరి ముదిరాజ్ తెలంగాణ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బిర్ల ఐలయ్య, రాజ్యసభ మాజీ సభ్యులు వి హనుమంతరావు, ఆర్ కృష్ణయ్య, జాజుల శ్రీనివాస్ గౌడ్, కోదండరామ్, విశారదన్, జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ చిరంజీవులు, డాక్టర్ నిజ్జన రమేష్ డాక్టర్ వట్టికూటి రామారావు, సాంబశివ, డాక్టర్ కంకల ఎలేందర్ కురుమ, లింగస్వామి కురుమ, రెడ్డి శ్రీనివాస్ ముదిరాజ్, కోరే కుమార్, స్వామి, అరుణ్, సుధాకర్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ నగర్ కాలనీలో బీఆర్ఎస్ ప్రచారానికి విశేష స్పందన

జయభేరి, ఎల్లారెడ్డి గూడ :

ఎల్లారెడ్డి గూడ పరిధిలోని ఈమార్ గూడ టిఫిన్ సెంటర్ లో టీ తాగుతూ అక్కడి ప్రజలతో మాట ముచ్చట చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. టీ తాగుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో చేసిన మోసాలను ప్రజలకు గుర్తు చేస్తూ 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ పాలన గురించి... 2 సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, గాలికి వదిలేసిన హామీలు జూబ్లీహిల్స్ ప్రజలకు వివరించి కారు గుర్తుకు ఓటు వేసి బిఆర్ఎస్ పార్టీ ని మాగంటి సునితమ్మను గెలిపించాలని కోరిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు అప్పు ఖాన్, ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని BRS పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టెక్స్ టైల్ పార్క్‌లో ముంపు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే



జయభేరి, పరకాల, అక్టోబర్ 31:

శుక్రవారం గీసుగొండ, సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్ లో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నీట మునిగిన ప్రాంతాలను అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టెక్స్ టైల్ పార్క్ లోని వివిధ ప్రాంతాలను సందర్శించి, నీటి నిల్వల పరిస్థితిని సమీక్షించారు. అకాల వర్షాలకు టెక్స్‌టైల్ పార్కులో కోతకు గురైన రోడ్లను పరిశీలించారు. పార్క్ రోడ్లపై రైతులు ఆరబోసిన మొక్కజొన్న పంట తడిసిన రైతులను ఎమ్మెల్యే పరామర్శించారు. అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతుల వివరాలను అధికారులు నమోదు చేయాలని, పంట నష్టాన్ని అంచనా వేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు.

## ఉద్యోగ విరమణ సన్మాన సభ

■ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి




జయభేరి, పరకాల, అక్టోబర్ 31:

పరకాల మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సేవలందించిన పెద్ది ఆంజనేయులు పదవీ విరమణ పొందిన సందర్భంగా నిర్వహించిన ఉద్యోగ విరమణ అభినందన సన్మాన సభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంజనేయులు ప్రభుత్వ సేవలో ఉన్నంత కాలం ప్రజలకు, అభివృద్ధి కార్యక్రమాలకు అంకితభావంతో సేవలందించారని కొనియాడారు.

## ఉపఎన్నికల కోఆర్డినేటర్ గా మడికొండ శ్రీను

జయభేరి, పరకాల, అక్టోబర్ 31:



జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలపరచిన ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుకోసం, రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ నేతృత్వంలో టీపీసీసీ ఎస్ సి సెల్ రాష్ట్ర కమిటీ పక్షాన ఎన్నికల ప్రచారం సోమాజిగూడ డివిజన్ ఏరియాలో ఎన్నికల కోఆర్డినేటర్ గా మడికొండ శ్రీనును నియమించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీను తనకు ప్రచార భాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డికి, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కి, ఏఐసీసీ ఎస్ సి సెల్ కన్వీనర్, టీపీసీసీ ఎస్ సి సెల్, తెలంగాణ రాష్ట్ర ఎస్ సి కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంకి, పరకాల శాసన సభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డికి, టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్యకి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని రాజేందర్ రెడ్డికి, కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు.

## కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా

■ చల్లా ధర్మారెడ్డి



జయభేరి, పరకాల, అక్టోబర్ 31:

కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. పరకాల నియోజకవర్గంలోని దామెర మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు తుత్తురు సత్యం తల్లి లచ్చమ్మ ఇటీవలే మృతిచెందగా నేడు వారి కుటుంబాన్ని చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా లచ్చమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే వెంట పరామర్శించిన వారిలో మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ పటేల్ జీవిత స్ఫూర్తి ప్రతి భారతీయ యువకుడికి మార్గదర్శకం

■ ఇన్స్పెక్టర్ మేడిపల్లి గోవింద్ రెడ్డి

జయభేరి, మేడిపల్లి :






దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతీక అయిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా, రాచకొండ కమిషనరేట్, మేడిపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో "రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడింది ఈ కార్యక్రమంలో, ప్రజలు వాకర్స్ అసోసియేషన్, విద్యార్థినీ విద్యార్థులు, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని "ఒక భారత్ ఏకతా భారత్" నినాదాలతో ఉత్సాహంగా పరుగు పందెంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మేడిపల్లి గోవింద్ రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ పటేల్ జీవిత స్ఫూర్తి ప్రతి భారతీయ యువకుడికి మార్గదర్శకం కావాలని, దేశ సమగ్రత కాపాడటంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా భావించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మంది వరకు పాల్గొన్నారు.




## పటేల్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

జయభేరి, యాదగిరిగుట్ట, అక్టోబర్ 31:

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా యాదాద్రి ఏసీపీ శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట 2కె రన్ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి పాదాల దగ్గర నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు రన్ ఫర్ యూనిటి పేరుతో 2కె రన్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా యాదాద్రి ఏసిపి శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ.. సర్ధార్ వల్లభాయ్ పటేల్ భారత దేశానికి చేసిన సేవలను కొనియాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో ముందుకు సాగాలని, ఆయన ఆశయాను సాధించేందుకు ప్రతి ఒక్కరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2కె రన్ లో యువకులు, స్థానికులు, విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట పట్టణ సీఐ భాస్కర్, ఎస్సైలు సుధాకర్, నందనాయక్, పోలీసు సిబ్బంది, బిజేపి పార్టీ పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి



జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 31:

తుర్కపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం హాస్పిటల్ లో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ అయినాల చైతన్య మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మమత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జివిలికపల్లి శ్రీనివాస్, బీసీ సెల్ జిల్లా కోఆర్డినేటర్ దేవరుప్పల ఐలయ్య, మాజీ సర్పంచ్ సోముల వెంకటేష్, ఎస్సీ సెల్ నాయకులు సోన్నాయిల రఘు, బీసీ సెల్ నాయకులు రామగోని వెంకటేష్, పనగట్ల సుదర్శన్, పసుల సత్యనారాయణ, ఇందిరానగర్ కనకయ్య, రాజాలు, హనుమంతు నాయక్, బాలు నాయక్, పలుగుల జనార్ధన్, పలుగుల శ్రీనివాస్, అమరేందర్, చాడ కరుణాకర్ రెడ్డి, బోయిని కొండల్, రత్నాల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలు అమలు చేయాలి

జయభేరి, గార్ల, అక్టోబర్ 31:




కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలని సిపిఎం మండల నాయకులు వంగూరి వెంకటేశ్వర్లు, వి.కొండయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల పరిధిలోని పినిరెడ్డిగూడెం గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీపై విశ్వాసంతో ప్రజలు గెలిపించారని, కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతుందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందని, తక్షణమే ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వృద్ధులకురు. 4 వేల రూపాయలు,వికలాంగులకు రు.6 వేల రూపాయల పెన్షన్లు ఇస్తామన్న హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సీతారాం, వి. సాయి,ఎం.రాజు, డి.ఎల్లయ్య, ఎం.లక్ష్మి, నాగమణి, ఉప్పలయ్య, ఎల్లమ్మ, ద్వాలి, బుజ్జి, యాదమ్మ, శాంతి, కౌసల్య, భద్రి, రాజా, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు నిరంతరం అండగా నిలిచిన జెండా ఏఐటీయూసీ

జయభేరి, యాదగిరిగుట్ట:



కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోద శ్రీరాములు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ సంఘం జెండాను యాదగిరిగుట్టలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గోద శ్రీరాములు మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం ఉద్యమించి అనేక చట్టాలు తీసుకొచ్చి కార్మికులకు నిరంతరం అండగా నిలిచిన జెండా ఏఐటీయూసీ అని అన్నారు. సుదీర్ఘ పోరాటాలు చేసి సాధించుకున్న కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని, ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ పరం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం సంఘటితమై ఉద్యమాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, నేతలు పేరబోయిన పెంటయ్య, గోపగాని రాజు, మునుకుంట్ల నర్సమ్మ, కళ్లెం సిద్దులు, స్వామి, చందునాయక్, ఇస్తారి, శ్రీను, నాగరాజు, శంకర్, వీరమణి, అండాలు, కళమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జై హనుమాన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అనాధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయం



జయభేరి, తుర్కపల్లి, అక్టోబర్ 31:

ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం తుర్కపల్లి మండల కేంద్రంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశంలో ఉన్న సంస్థానాలన్నిటిని ఆయన రాజకీయ చాతుర్యంతో దేశంలో కలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ చాంద్ పాషా, సీనియర్ నాయకులు కందుకూరి చిన్నచలమయ్య, పెండెం నరసింహులు, గోనె కృష్ణ, రాజు, కందుకూరి వేణు, దొంకెన ప్రభాకర్, మాడోత్తు సురేష్ నాయక్, మోహన్ నాయక్, కానుగంటి భాను పాల్గొన్నారు.



# నిన్నొదిలి కాసేపైనా ఉంటానా..

వినూత్న కథా చిత్రాలతో మెప్పించే అల్లరి నరేష్ తాజాగా యాక్షన్ థ్రిల్లర్ '12ఏ రైల్వే కాలనీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకురాబోతున్నారు. నాని కాసరగడ్డ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. 'పొలిమేర' సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ అనిల్ విశ్వనాథ్ షోరన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలో ఈ చిత్రం విడుదలకానుంది. శుక్రవారం మ్యూజికల్ ప్రమోషన్స్‌కు శ్రీకారం చుట్టారు. 'కన్నొదిలి కలనొదిలి..' అనే పాటను విడుదల చేశారు. 'కన్నొదిలి కలనొదిలి కనుపాపే ఉంటుందా..నిన్నొదిలి నేకదిలి కాసేపైనా ఉంటానా..' అంటూ చక్కటి భావాలతో ఈ పాట ఆకట్టుకుంది. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ పాటను హేషమ్ అబ్దుల్ వహాబ్ ఆలపించారు. ఈ పాటలో నాయకానాయికలు అల్లరి నరేష్, కామాక్షి భాస్కర్ల మధ్య కెమిస్ట్రీ ప్రత్యేకాకర్షణగా నిలిచింది. సాయికుమార్, వైవా హర్ష, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు, షోరన్నర్: డాక్టర్ అనిల్ విశ్వనాథ్, దర్శకత్వం: నాని కాసరగడ్డ.

# ఆ సినిమాకు సీక్వెల్ రాబోతున్నదా?



ప్రస్తుతం సాయిదుర్గతేజ్ 'సంబరాల యేటిగట్టు' సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. సాయిదుర్గతేజ్ కెరీర్‌లో భారీ చిత్రంగా నిర్మాత నిరంజన్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానున్నది. రోహిత్ దర్శకుడు. ఇదిలావుంటే.. తాజా సమాచారం ప్రకారం సాయిదుర్గతేజ్ ఓ కొత్త సినిమా ఒప్పుకున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

ఈ సినిమాకు దేవకట్టా దర్శకత్వం వహిస్తారట. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో 'రిపబ్లిక్' సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. ఆ సినిమాకు సీక్వెల్‌గా ఈ తాజా సినిమా ఉండనున్నదని టాక్. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

# ఆ హీరో సినిమాలో నటించి తప్పు చేశాను..



టాలీవుడ్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్లలో మీనాక్షి చౌదరి ఒకరు. లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం వంటి చిత్రాలతో వరుసగా విజయాలను ఖాతాలో వేసుకున్నారు. దీంతో దక్షిణాదిలో డిమాండ్ ఉన్న హీరోయిన్ గా మారారు. కానీ ఇప్పుడు ఈ బ్యూటీ తెలుగులో సరైన అవకాశం కోసం వెయిట్ చేస్తుంది. తెలుగు, తమిళం భాషలలో వరుస సినిమాల్లో నటించి మెప్పించింది. అయితే ఓ సినిమా విషయంలో తాను తప్పు చేశానని అంటుంది మీనాక్షి. గతంలో ఓ సినిమా చేసినందుకు ఎంతో బాధపడ్డానని ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. ఆ సినిమా మరేదో కాదండి. దళపతి విజయ్ నటించిన గోట్. విజయ్ దళపతి నటించిన ది గోట్ చిత్రంలో నటించింది మీనాక్షి. అయితే ఆ సినిమా విడుదల తర్వాత తన పాత్రపై సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేశారని ఆవేదన వ్యక్తం చేసింది.

తన పాత్ర పై వచ్చిన విమర్శలు చూసి ఎంతో బాధపడ్డానని.. వారం రోజులు డిప్రెషన్ లోకి వెళ్లానని తెలిపింది. ఆ ట్రోల్స్ వల్ల తాను ఎంచుకునే కథలు, సినిమాలపై మరింత ఫోకస్ పెట్టాలని అర్థమైందని.. అప్పటి నుంచి తన పాత్రకు ఇంపార్టెన్స్ ఉన్న వాటినే అంగీకరించాలని నిర్ణయించుకున్నట్లు మీనాక్షి వెల్లడించింది. ఆ తర్వాత పాత్ర ప్రాధాన్యత ఉన్న సినిమాలు సెలక్ట్ చేసుకుంటుంది మీనాక్షి. ఇక లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాల తర్వాత వరుస అవకాశాలతో బిజీగా ఉంటుందని అనుకున్నారు. కానీ ఈ బ్యూటీ ఉన్నట్లుండి ఇండస్ట్రీలో సైలెంట్ అయ్యింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో నిత్యం క్రేజీ ఫోటోషూట్స్ షేర్ చేస్తూ సందడి చేస్తుంది.



# హీటెక్కిస్తోన్న వయ్యారి..

ఇన్నాళ్లు తల్లి పాత్రలు పోషించిన ఆమె.. ఇప్పుడు వెండితెరపై హీరోయిన్ గా దూసుకుపోతుంది. ఆమె మరెవరో కాదండి.. బుల్లితెరపై అత్యధిక టీఆర్పీ రేటింగ్ అందుకున్న గుప్పెడంత మనసు సీరియల్ ఫేమ్ జగతి మేడమ్.. అలియాస్ జ్యోతిరాయ్. ఈబ్యూటీకి తెలుగు రాష్ట్రాల్లో మంచి ఫాలోయింగ్ ఉంది. జగతి మేడమ్ పాత్రలో చీరకట్టులో ఎంతో హుందాగా కనిపిస్తూ.. సహజ నటనతో జనాలను కట్టిపడేసింది. ముఖ్యంగా తన కొడుకు రిషి ప్రేమ కోసం ఆరాటపడే తల్లి పాత్రలో అద్భుతమైన నటనతో జనాల హృదయాలను గెలుచుకుంది. ఈ సీరియల్ ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యింది.

ఈ సీరియల్లో తల్లి పాత్రలో నటించిన జ్యోతిరాయ్.. ఇప్పుడు హీరోయిన్ గా మారింది. ప్రస్తుతం ఆమె కథానాయికగా కిల్లర్ అనే చిత్రంలో నటిస్తుంది. లేడీ ఓరియెంటెడ్ మాస్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ సినిమా టీజర్, గ్లింప్స్ మరిన్ని అంచనాలు క్రియేట్ చేశాయి.

అయితే కథానాయికగా మారిన తర్వాత జ్యోతిరాయ్ నెట్టింట ఫుల్ యాక్టివ్ అయ్యింది. నిత్యం క్రేజీ ఫోటోషూట్స్ షేర్ చేస్తూ తెగ సందడి చేస్తుంది. ముఖ్యంగా గ్లామర్ ఫోటోషూట్లతో నానా రచ్చ చేస్తుంది. తాజాగా పొట్టి గౌనులో ఫోటోలకు ఫోజులిచ్చింది. ఒకప్పుడు చీరకట్టులో పద్ధతిగా కనిపించిన జ్యోతిరాయ్.. ఇప్పుడు ఇలా గ్లామర్ ఫోజులతో ఫోటోస్ షేర్ చేయడం చూసి జనాలు ఆశ్చర్యపోతున్నారు. ఇప్పటిప్పుడే వరుసగా హీరోయిన్ అవకాశాలు అందుకుంటుంది జ్యోతిరాయ్.

# మాస్ జాతర సినిమాకు రవితేజ, శ్రీలీల ఎంత రెమ్యునరేషన్ తీసుకున్నారో తెలుసా..?



మాస్ మహారాజా రవితేజ నటించిన లేటేస్ట్ మూవీ మాస్ జాతర. ఈ సినిమాకు కొత్త డైరెక్టర్ భాను భోగవరపు దర్శకత్వం వహించగా.. ఇందులో శ్రీలీల కథానాయికగా నటించింది. రవితేజ కెరీర్ లో 75వ సినిమాగా వచ్చిన ఈ మూవీపై ముందు నుంచి భారీ అంచనాలు నెలకొన్నాయి. ధమాకా హిట్ తర్వాత మరోసారి శ్రీలీల, రవితేజ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో ఈ సినిమాపై మంచి హైప్ నెలకొంది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని రూపొందించామని ముందు నుంచి చిత్రయూనిట్ ప్రకటించింది. అలాగే టీజర్, ట్రైలర్, సాంగ్స్ సైతం ఆకట్టుకున్నాయి. ఇక ఇప్పుడు ఎట్టకేలకు ఈ సినిమా అడియన్స్ ముందుకు వచ్చింది. అక్టోబర్ 31న ఈ చిత్రాన్ని గ్రాండ్ గా రిలీజ్ చేశారు.

ఇవి కూడా చదవండి : ఎన్నాళ్లకు కుదిరిందయ్యో.. అప్పుడు ప్రేయసిగా. ఇప్పుడు స్పెషల్ సాంగ్‌లో

ఇదిలా ఉంటే.. ఈ సినిమాకు రవితేజ, శ్రీలీల మిగతా నటీనటులు తీసుకున్న పారితోషికం వివరాలు ఇప్పుడు ఫిల్మ్ వర్గాల్లో వైరలవుతున్నాయి. ఇందులో వీరిద్దరు మాత్రమే కాకుండా నవీన్ చంద్ర, రాజేంద్ర ప్రసాద్, నరేష్ కీలకపాత్రలు పోషించారు. అలాగే భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా.. ఈ చిత్రానికి రూ.65 కోట్ల వరకు బిజినెస్ జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పుడు వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఈ సినిమాకు రవితేజ రూ.25 కోట్లు పారితోషికం తీసుకున్నట్లు టాక్. అలాగే శ్రీలీల సైతం ఈ చిత్రాన్నికి రూ.5 కోట్లు తీసుకున్నట్లు సమాచారం.

ఇక ప్రస్తుతం టాలీవుడ్ ఇండస్ట్రీలో వరుస హిట్లతో ఫుల్ ఫాంలో ఉన్న మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్ సిసిరోలియో మాస్ జాతర చిత్రానికి రూ.8 కోట్లు అందుకున్నారని.. నవీన్ చంద్ర, రాజేంద్ర ప్రసాద్, నరేష్ మిగతా నటీనటులు లక్షల్లో పారితోషికం అందుకున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి పాజిటివ్ రివ్యూస్ వస్తున్నాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**